నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శనివారం 21 జూన్ 2025 | KHAMMAM

# వారిని విధుల్లోకి తీసుకోవద్దు..

సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల అక్రమ నియామకంపై ఏఐటీయూసీ ఆందోళన



భద్రాద్రి జిల్లా ఇల్లెందు బంగ్లోస్ వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

కొత్తగూడెం సింగరేణి, జూన్ 20 : సింగరేణి సంస్థలో సివిల్ అధికారులు అక్రమ పద్ధతుల్లో కాంట్రాక్టు కార్మికులను నియమించడంపై ఆగ్రహిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు బంగ్లోస్ వద్ద కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రీజినల్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, కిష్టఫర్ మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల మధ్య ఘర్షణ సృష్టిస్తున్న సివిల్ అధికారులు దొడ్డిదారిన పోటీ కార్మికులను తీసుకురావడం సరికాదని, బంగ్లోస్ వద్ద జరిగే పరిణామాలకు సివిల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బంగ్లోస్ వద్ద జరుగుతున్న ఆందోళనలు, నిరసనలకు సివిల్ అధికారులే బాధ్యులని, వారు తప్పుడు పద్ధతిలో టెండర్లు పిలవడం వల్ల రైటర్ బస్తీ, బంగ్లోస్ కాంట్రాక్టు కార్మికుల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనిపై తక్షణమే తమ వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ క్రమంలో ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న పోటీ కార్మికులను అడ్డుకొని శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో రంజిత్, కృష్ణమూర్తి, రాజు, శంకర్, నాగమ్మ, సురేశ్, ఆదిలక్ష్మి, సుశీల, విజయ్, సుజాత, మాధవి, కల్యాణి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పినపాక ఎమ్మెల్యే పాయంకు నిరసన సెగ

- కారు ఎదుట బైఠాయించి సారపాకవాసుల ఆందోళన
- తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తుల డిమాండ్



పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కారు ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న సారపాక గ్రామస్తులు

బూర్గంపహాడ్, జూన్ 20 : తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సారపాక గ్రామస్తులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కారు ఎదుట బైఠాయించి శుక్రవారం నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాళ్లగొమ్మూరు పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత అక్కడి నుంచి ఎమ్మెల్యే బయటకు వస్తుండగా సారపాక గ్రామస్తులు.. ఆయన కారు ఎదుట బైఠాయించి తమ తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చామని, ఈవోకు సైతం సమస్యను వివరించినా పరిష్కారం కాలేదని ఆరోపించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే అనుచరులు ఆందోళన చేస్తున్న వారిని సముదాయించి, పక్కకు తీసుకెళ్తుండగా ఈ ఘటనను చిత్రీకరిస్తున్న సెల్‌ఫోన్‌ను సైతం ఆయన అనుచరులు లాక్కున్నారు. గ్రామస్తులను సముదాయించిన ఎమ్మెల్యే తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

### అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



ఆకేరు వద్ద ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

తిరుమలాయపాలెం, జూన్ 20 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ఏలువారిగూడెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం రావిచెట్టుతండా సమీపంలోని ఆకేరు ఇసుక రీచ్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక కూపన్లు సకాలంలో జారీ చేయాలని ఆదేశించారు. ఇసుక రీచ్‌ల వద్ద స్వయం సహాయక సంఘాల మహిళలచే ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ శిలార్ సాహెబ్, తహసీల్దార్ లూథర్ విల్సన్, ఏవో నారెడ్డి సీతారామరెడ్డి, ఎంపీవో సూర్యనారాయణ, ఆర్ఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యరంగం కుదేల్

- మత్స్యకారులను పూర్తిగా విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- జూన్ చివరికి వచ్చినా పూర్తికాని చేపపిల్లల టెండర్లు
- గతేడాది సైతం సీజన్ చివరిలో అరకొరగా పంపిణీ
- మమ అనిపించి చేతులు దులుపుకుంటున్న వైనం
- దయనీయ స్థితిలో మత్స్యకారుల బతుకులు
- బీఆర్ఎస్ హయాంలో ముందుగానే చేపపిల్లల పంపిణీ



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. ఒక్కో రంగం కుదేలవుతూ వస్తున్నది. గత బీఆర్ఎస్ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపారు. అందుకోసం రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారు.. మరెన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. ఫలితంగా అన్నివర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయి. ముఖ్యంగా చెరువులను బాగు చేయడంతో అటు వ్యవసాయ రంగంతోపాటు మత్స్యరంగం బాగా అభివృద్ధి చెందాయి. ప్రజలకు ఏమికావాలో అవి కేసీఆర్ ప్రభుత్వం సకాలంలో అందించేది. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. మత్స్యకారులను పూర్తిగా విస్మరించింది. చేపపిల్లలను సమయానికి పంపిణీ చేయకుండా ఎప్పటికో ఆలస్యంగా చేస్తున్నది. దీంతో సీజన్ అంతా అయిపోయాక చేపలు చేతికొస్తుండడంతో పెద్దగా ఉపయోగం లేకుండాపోతున్నది. జూన్ నెల చివరికి వచ్చినా ఇంతవరకు చేపపిల్లల టెండర్లు పూర్తికాలేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. గత ఏడాది కూడా సీజన్ చివరిలో అరకొరగా చేపపిల్లలను పంపిణీ చేసి మమ అనిపించడం గమనార్హం.

- భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 20 (నమస్తే తెలంగాణ)



గత ప్రభుత్వ హయాంలో చెరువుల్లో పుష్కలంగా చేపల వేట (ఫైల్)





కులవృత్తిని నమ్ముకొని జీవనం సాగించిన మత్స్యకారుల జీవితాల్లో గత కేసీఆర్ ప్రభుత్వం వెలుగులు నింపింది. చెరువులు నిండిందే తడవుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా 763 చెరువుల్లో 1.81 కోట్ల చేపపిల్లలను ప్రభుత్వం పంపిణీ చేయగా.. అధికారులు వాటిని చెరువుల్లో పోశారు. అవి ఎదిగొచ్చిన తర్వాత పండుగ వాతావరణంలో మత్స్యకారులు వేట సాగించి ఏ లోటూ లేకుండా కుటుంబాలను పోషించుకున్నారు. పిల్లలను చదివించుకున్నారు. పెళ్లీడుకొచ్చిన ఆడపిల్లల వివాహాలు చేశారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి మారింది. మత్స్యకారుల జీవితాల్లో చీకట్లు కమ్ముకునే పరిస్థితులు నెలకొన్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం ఏటా 1.81 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేస్తే.. కాంగ్రెస్ సర్కారు గత ఏడాది కేవలం 80 లక్షల చేపపిల్లలు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నది. దీంతో గత ఏడాదే కాంగ్రెస్ సర్కారుపై నమ్మకం కోల్పోయిన మత్స్యకారులు అప్పోసప్పో చేసి చేపపిల్లలు కొనుగోలు చేసి చెరువుల్లో పోసేందుకు సిద్ధమవుతున్నారు.

### బీఆర్ఎస్ హయాంలో చెరువుల నిండా చేపలు

గత కేసీఆర్ సర్కారు 2014లో అధికారంలోకి వచ్చీరాగానే చెరువులు, కుంటలను అభివృద్ధి చేసింది. ఏళ్లనాటి చెరువులు, కుంటలకు మిషన్ కాకతీయతో పూర్వవైభవం తీసుకొచ్చింది. పూడిక తీయడంతోపాటు చెరువు కట్టలు, తూములను మరమ్మతు చేయించింది. నీటి నిల్వ సామర్థ్యంతో అటు సాగుకు, ఇటు చేపల పెంపకానికి అనువుగా ఉండే విధంగా చర్యలు చేపట్టింది. అంతేకాక వేసవిలో సైతం చెరువులు జలకళతో నిండుకుండలా కనిపించేవి. ఈ క్రమంలో కేసీఆర్ ప్రభుత్వం 2017 నుంచి మత్స్య సహకార సంఘాలను బలోపేతం చేసి జిల్లాలో 58 సంఘాలను అందుబాటులోకి తెచ్చింది. 3,200 మంది సభ్యులకు సభ్యత్వం కల్పించింది. క్రమేపీ ఆ సంఘాలు ఇప్పుడు 78కి చేరగా.. సభ్యులు 3,548కి పెరిగినా.. మత్స్య సంపదను పెంచడంతో కాంగ్రెస్ సర్కారు విఫలమైందనే చెప్పాలి. అయితే వానకాలం వచ్చినా ఈ ఏడాది చేపపిల్లల పంపిణీ జరుగుతుందా? లేదా? అని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

### పూర్తికాని టెండర్లు..

గత ఏడాది సీజన్ వచ్చినా చేపపిల్లల జాడ లేకపోవడంతో ఇక పంపిణీ చేయరనే నిర్ణయానికి మత్స్యకారులు వచ్చారు. కానీ.. చివరి సమయంలో ఇచ్చాం అనిపించుకోవడం కోసం గత ప్రభుత్వం ఇచ్చిన వాటిలో 50 శాతం మాత్రమే చేపపిల్లలు పంపిణీ చేసి మమ అనిపించారు. అయితే ఈ ఏడాది పరిస్థితి ఎలా ఉంటుందోనని మత్స్యకారులు ఇప్పటి నుంచే దిగులు చెందుతున్నారు. సీజన్ దాటిపోతున్నా టెండర్ల ప్రక్రియ ఉంటుందా? ఉండదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ముందస్తు ప్రణాళికతో వెళ్తేనే చేపపిల్లల పంపిణీకి అవకాశం ఉంటుందని, లేదంటే ఇచ్చినా ఉపయోగం ఉండదని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

### 763 చెరువులు.. 3,548 మంది సభ్యులు..

జిల్లావ్యాప్తంగా 763 చెరువులు ఉండగా.. వాటిలో 3 రిజర్వాయర్లు. ఒకటి తుమ్మల చెరువు, తాలిపేరు, పెదవాగు ప్రాజెక్టు ఉన్నాయి. 77 పెద్ద చెరువులు, 683 సీజనల్ చెరువులుగా గుర్తించారు. 763 చెరువుల్లో 1.81 కోట్ల చేపపిల్లలు పోయాల్సి ఉండగా.. ఏటా రూ.కోటి వ్యయంతో 1.71 కోట్ల చేపపిల్లలను వదులుతున్నారు. దీంతో 2017 నుంచి 2023 వరకు మత్స్య సంపదకు అడ్డులేకుండా చెరువుల్లో పుష్కలంగా పెరిగాయి. కానీ.. ఇప్పుడు చేపాచేపా నువ్వెక్కడా అంటే నా అడ్రస్ దొరుకుతుందా? అన్నట్లుంది పరిస్థితి.



#### గత ఏడాది సగం పిల్లలే ఇచ్చారు..

కొత్త ప్రభుత్వం వచ్చిందంటే ఇంకా ఎక్కువ చేపపిల్లలు ఇస్తారేమో అనుకున్నా. కానీ.. సగం చేపపిల్లలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. వర్షాలతో చెరువు అలుగుల్లో కొన్నిపోతే.. కొన్ని రద్దు పోతే.. మిగిలినవి పావువంతే అయ్యాయి. చెరువు సామర్థ్యాన్ని బట్టి చేపపిల్లలు ఇవ్వాలి. లేదంటే అసలు ఇవ్వకపోయినా పర్వాలేదు. వేరే పనులు చేసుకొని బతుకుతాం. ఇప్పటివరకు ఇస్తారో? ఇవ్వరో? అనేది కూడా చెప్పలేదు.

- ముడిగ నర్సింహారావు, మత్స్య సొసైటీ అధ్యక్షుడు, రామచంద్రునిపేట, టేకులపల్లి మండలం



#### డబ్బులిస్తే చేపపిల్లలు కొనుక్కుంటాం..

గత ఏడాది సీజన్ దాటాక సగం చేపపిల్లలే ఇచ్చారు. సభ్యులకు కూలి కూడా గిట్టుబాటు కాలేదు. చేపల వేట కొనసాగించి వాటిని అమ్మాలంటే చాలా కష్టమైన పని. చెరువుల్ని నమ్ముకుని జీవిస్తున్నాం. ఇంకా రెండు నెలలు దాటితే ఇచ్చినా.. ఇవ్వకపోయినా ఒకటే. నాసిరకం చేపపిల్లలకు బదులు డబ్బులిస్తే మేమే మంచి చేపపిల్లలు తెచ్చుకుని చెరువుల్లో పోసుకుంటాం. గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఇంత ఇబ్బంది కలగలేదు.

- బానోత్ సూర్యం, శింగభూపాలెం సొసైటీ అధ్యక్షుడు, కొమ్ముగూడెం, జూలూరుపాడు మండలం



#### టెండర్ల ప్రక్రియ పూర్తికాలేదు..

గత ఏడాది జిల్లాలో 80 లక్షల చేపపిల్లలు పంపిణీ చేశాం. ఈ ఏడాది ఇంతవరకు చేపపిల్లల మీద స్పష్టత రాలేదు. రాష్ట్రవ్యాప్తంగా టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. టెండర్లు పూర్తయితే ఎంత ఇస్తారు అనే దానిపై స్పష్టత వస్తుంది. జిల్లాలో మత్స్య సహకార సంఘాలను బలోపేతం చేస్తున్నాం. జిల్లాలో 78 సంఘాలు ఉన్నాయి. 3,548 మంది సభ్యులు ఉన్నారు. ఇంకా సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం.

- ఎండీ.ఇంతియాజ్, జిల్లా మత్స్యశాఖ అధికారి



ఇరవెండి బీట్ పరిధిలో గిరిజన మహిళలతో వాగ్వాదానికి దిగిన అటవీ శాఖ అధికారులు

## గిరిజన మహిళలపై అటవీ అధికారుల దాడి

- దురుసుగా ప్రవర్తించిన అధికారులు, సిబ్బంది
- వీడియో తీస్తుండగా సెల్‌ఫోన్లు లాక్కొని మహిళలపై దౌర్జన్యం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధిత గిరిజన మహిళలు



బూర్గంపహాడ్, జూన్ 20 : పోడు సాగుదారులకు చెందిన భూముల్లోకి అటవీ శాఖ అధికారులు వెళ్లడంతో గిరిజన మహిళలు, అటవీ అధికారుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో అధికారులు గిరిజన మహిళలపై దాడి చేయడంతోపాటు దురుసుగా ప్రవర్తించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటన బూర్గంపహాడ్ మండలం ఇరవెండి బీట్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోసుగుంప గ్రామంలోని పోడు సాగుదారులకు చెందిన భూముల్లోకి అటవీ అధికారులు జేసీబీలతో వెళ్లి కందకాలు తీయిస్తుండగా గిరిజన మహిళలు అడ్డుకున్నారు. దీంతో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది దాడికి దిగడంతోపాటు దుస్తులు చింపి తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారని గిరిజన మహిళలు ఆరోపించారు. 25 ఏళ్లుగా 100 ఎకరాల్లో పోడు సాగు చేసుకుంటున్న తమను అటవీ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, జేసీబీతో వచ్చి దౌర్జన్యం చేశారని, అడ్డుకున్న తమను దారుణంగా కొట్టారని వాపోయారు. ఈ ఘటనను అక్కడే ఉన్న కొందరు మహిళలు సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా అటవీ అధికారులు నాగరాజు, రాంబాబు, సిబ్బంది బాబురావు, రమేశ్‌లు ఫోన్లు లాక్కొని వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 25 ఏళ్లుగా ఇక్కడే జీవనం సాగిస్తూ పోడు చేసుకుంటున్నామని, తమకు ఆధార్, రేషన్, ఓటరు కార్డులు ఉన్నాయని తెలిపారు. తమపై అటవీ శాఖ అధికారులు దాడి చేసిన విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత మహిళలు తెలిపారు. దీనిపై అశ్వాపురం రేంజర్ రమేశ్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా.. అందుబాటులో లేరు.

## విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి

### ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, అధికారుల సమీక్షలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మామిళ్లగూడెం, జూన్ 20 : విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి విపత్తుల నిర్వహణపై ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, సంబంధిత అధికారులతో శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో మూడు నెలలపాటు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు స్టేషన్‌లో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వరద ప్రభావిత, ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా రిహాబిలిటేషన్ సెంటర్లను ముందుగా గుర్తించాలని, అవసరమైతే ప్రైవేటు ఫంక్షన్ హాళ్లను కూడా సెంటర్లుగా ఏర్పాటు చేసేందుకు మ్యాపింగ్ చేసి సోమవారం నాటికి వివరాలు అందించాలని ఆదేశించారు. వరద హెచ్చరికలు రాగానే జిల్లాలో హెలికాప్టర్ అందుబాటులో పెట్టుకోవాలని, బోట్లు, రోప్, లైఫ్ జాకెట్స్, మైకులు, లైట్లు, జేసీబీ, క్లీనింగ్ పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతీ మండలంలో విపత్తుల నివారణకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో పద్మశ్రీ, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం కమాండర్ గౌతమ్, ఏఎస్ఐ మద్దలేటి, సిబ్బంది సురేశ్‌కుమార్, జగదీశ్, రియాజుద్దీన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాసుపత్రిలో మరోసారి సమ్మె!




ఖమ్మం పెద్దాసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

- వేతనాలు ఇస్తామన్న హామీ చెత్తబుట్టలోకి..
- విధులు బహిష్కరించిన బడుగుజీవులు
- సర్కారే ఇవ్వడం లేదంటున్న వైద్యాధికారులు

ఖమ్మం సిటీ, జూన్ 20 : ఖమ్మం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో మరోసారి సమ్మె సైరన్ మోగింది. పెండింగ్‌లో ఉన్న నాలుగునెలల వేతనాలు చెల్లించాలని శుక్రవారం 259 మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళనబాట పట్టారు. కాంగ్రెస్ సర్కారు తీరుపై కడుపుమండి సీఐటీయూ, టీయూసీఐ కార్మిక సంఘాల మద్దతుతో దవాఖాన ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఇటీవలే దాదాపు వారం రోజులపాటు ధర్నాలు చేసిన అనంతరం హైదరాబాద్‌లోని డీఎంఈ కార్యాలయం ముట్టించగా ఇరవై నాలుగు గంటల్లో రెండు నెలల వేతనాలు చెల్లిస్తామనే హామీని గుర్తుచేశారు. పదిరోజులు గడిచినప్పటికీ నయా పైసా డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమకాలేదని, ఇచ్చిన మాట ఏమయ్యిందని ప్రశ్నించారు. కార్మికుల్లో అనేకమంది భర్తలు కోల్పోయిన వారే ఉన్నారని, కడుపున పుట్టిన బిడ్డలకు కనీసం పిడికెడు అన్నం కూడా పెట్టలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు ఇంటి అద్దెలు చెల్లించని కారణంగా యజమానులు వారిని ఇండ్లు ఖాళీ చేయిస్తున్నారని పేర్కొన్నారు. కేవలం కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యపు ధోరణి కారణంగా ఆకలి చావులను చూసే పరిస్థితులు దాపురించాయని వ్యాఖ్యానించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదని, సర్కారు దవాఖానలో పనిచేస్తున్న నిరుపేద కార్మికులను పట్టించుకున్న పాపానపోవడం లేదని ధ్వజమెత్తారు. కార్మికుల సమ్మెకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు. ఆందోళనను అంచెలంచెలుగా ఉధృతం చేస్తామని, శనివారం అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం, సోమవారం అన్ని పార్టీలు, సంఘాల మద్దతుతో ప్రభుత్వాసుపత్రిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గండమాల రామయ్య, కొయ్యల శ్రీనివాస్, ఉపేందర్, అంబేద్కర్, మాతంగి అనిల్‌కుమార్, కే జగదీష్, ఏ అశోక్, ఎం సైదులు, కే వెంకటేశ్వర్లు, పీ వెంకటరమణ, విజయమ్మ పాల్గొన్నారు.

### చేతులెత్తేసిన వైద్యాధికారులు..

ఖమ్మం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న పరిస్థితులపై స్థానిక వైద్యాధికారులు చేతులెత్తేశారు. కార్మికులు విధులు నిర్వహిస్తున్న మాట వాస్తవమే అయినప్పటికీ వారి వేతనాలకు సంబందించిన నిధులు ప్రభుత్వమే విడుదల చేయాల్సి ఉందని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బీ కిరణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. పైనుంచి డబ్బులు వస్తేనే మేము ఇస్తామని నిర్మొహమాటంగా చెబుతున్నారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి 20 నుంచి 30 మంది కార్మికులను రప్పించి పారిశుధ్య పనులు చేయిస్తున్నామని స్పష్టం చేశారు.

### తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు..

జిల్లా కేంద్రంలోని అతి పెద్ద సర్కారు దవాఖానలో 259 మంది కార్మికులు నిరాటంకంగా విధులు నిర్వహిస్తేనే అనేక రకాల సమస్యలు ఉత్పన్నమయ్యేవి. అలాంటిది కేవలం 20 నుంచి 30 మంది కేఎంసీ కార్మికులు పనులు చేస్తుంటే రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ప్రధానంగా మాతా, శిశు సంరక్షణ విభాగంలో ప్రసవాలు జరుగుతుంటాయి. ఆయా వార్డుల్లో, బాత్రూముల్లో ఎప్పటికప్పుడు శుభ్రంగా లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, అప్పుడే పుట్టిన చిన్నారులు ఇన్ఫెక్షన్ బారినపడే ప్రమాదం లేకపోలేదని పలువురు వైద్యులే అంటున్నరు. జనరల్ ఆసుపత్రిలోని అన్నిరకాల వార్డుల్లో తూతూమంత్రపు పనుల కారణంగా రోగులు ఎదుర్కొంటున్న కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే దవాఖాన ప్రతిష్ట మరింత దిగజారుతుందని ఆందోళన వ్యక్తం అవుతున్నది.